ప్రతిభావంతులకు ప్రోత్సాహం

- ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభగల విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్
- దరఖాస్తుకు ఈనెల 6వ తేదీ వరకు అవకాశం
- ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్ల 8వ తరగతి విద్యార్థులు అర్హులు


పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను అమలు చేస్తోంది. 2024–25వ విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 5వ తేదీ నుంచే ప్రారంభమవ్వగా ఈనెల 6వ తేదీ వరకు అవకాశం ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయా పాఠశాలల సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

నెలకు రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ. 12,000లు ఆర్థిక సాయం అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ సాయం అందిస్తారు. ఈ మేరకు నగదును ప్రతి ఏటా విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. చదువుకోవాలని ఆశ ఉండి పేదరికం ఆర్థిక పరమైన ఇబ్బందులు ద్వారా విద్యకు దూరమైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ ఆర్థిక సహాయం ఎంతో గానో ఉపయోగపడుతుంది.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదయం రూ. 3,50,000లకు మించ కూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. రాత పరీక్షలు ద్వారా స్కాలర్‌షిప్ పొందడానికి విద్యార్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులు అయితే పరీక్షల రుసుము రూ. 100లు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే పరీక్ష రుసుము రూ. 50లు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ www.bse.ap.gov.in నందు నమోదు చేసుకొనవచ్చును. దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి అధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరులను నమోదు చేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకార వేతనం పొందడానికి మంచి అవకాశం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకొవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆటంకం కలిగించే ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఈ ఉపకార వేతనం ఎంతగానో ఉపయోగపడుతుంది. కనుక ప్రతి ఒక్కరూ గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటరమణారెడ్డి ఉప విద్యాధికారి

పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గోనెగండ్ల : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మిరప, కంది, ఉల్లి పంటలు దెబ్బతినకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. పత్తి పంట నీటి ముంపునకు గురైనప్పుడు పిందెలు, కాయలు రాలి పోవడం, ఆకులు ఎర్రబారడం, వడిపోవడం జరుగుతుందన్నారు. ఆ సమయంలో నిలిచిన మురుగు నీటిని తీసివేయడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పోటాషియం నైట్రేట్ 5గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా 10 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలుపుకొని వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలన్నారు. తర్వాత ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ ఎరువులను పైపాటిగా వేసుకోవాలని చెప్పారు. తర్వాత అంతర సేద్యం చేసుకోవాలన్నారు. అలాగే వేరుకుళ్లు తెగులు నివారణకు పొలంలో నీరు తీసివేసిన తర్వాత 3గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ ఒక లీటర్ నీటిలో కలుపుకొని తెగులు సోకిన పాదుల చుట్టూ వేరు తడిచేలా పోయాలని సూచించారు. కాయ కుళ్లు తెగులు నివారణకు ఒక లీటర్ నీటికి 100 మిల్లీ గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి 2–3 సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

రాజగోపురానికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. ఆదోని పట్టణ వాస్తవ్యులు కమలాపురం మంజులదేవి, మోహన్‌కృష్ణ వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఆదోని సెంట్రల్: భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ అన్ని యాజమాన్య పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి పాఠశాలలను తెరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే సోమవారం 1 నుంచి 5వ తరగతి జరగవలసిన సెల్ఫ్ అసెస్మెంట్–1 పరీక్షను 3వ తేదీ, 6 నుంచి 10వ తరగతి పరీక్షను 6వ తేదీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఆదోని సెంట్రల్: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో కలకలం రేపుతున్న హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠినమైన చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కళాశాల విద్యార్థులకు రక్షణ కల్పించడం యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. విద్యార్థుల మాన ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారులు, పాలకులు స్పందించి భవిషత్తులో ఏ కళాశాలలో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

ఆదోని సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.నాగరాజు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ సీపీఎస్ విద్రోహ దినముగా పాటిస్తూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సీపీఎస్ వలన పదవీవిరమణ తర్వాత ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రి సమర్పించారు. కార్యక్రమంలో ఆదోని, కౌతాళం, కోసిగి, హోళగుంద మండలాల ఏపీటీఎఫ్ నాయకులు రాజమౌళి, సుదర్శన్‌రెడ్డి, ఓబులేసు, సుబ్బారెడ్డి, తిక్కస్వామి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


శ్రీనాథ్‌గుప్తాను సన్మానిస్తున్న విట్టా రమేష్

ఆదోని అర్బన్: ప్రముఖ సంఘ సేవకులు, ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు పురస్కారం లభించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం ఆయన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్, విట్టా రమేష్, రాయచోటి సుధాకర్, మాజీ డీఎస్పీ కొండారెడ్డి, శివరామ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ నేతలు డాక్టర్ గోపీనాథ్ పాల్గొని సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

పెండింగ్ పాఠ్యపుస్తకాల మంజూరు

కోసిగి: మండలంలో వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికి అందకుండా ఉన్న పెండింగ్ పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఆదివారం ఉదయం కోసిగికి చేరుకోవడంతో ఎంఈఓ–2 శోభరాణి దగ్గరుండి ఎమ్మార్సీ కార్యాలయంలో భద్ర పరచారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు 23వ తేదిన జిల్లా విద్యాధికారి శ్యామూల్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యార్థులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందుకు కొందరు విద్యార్థులు నేటికీ పుస్తకాలు అందలేదని ఫిర్యాదు చేశారన్నారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు మండలంలోని పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు పంపారని చెప్పారు. మండలానికి 15,484 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం


ఎమ్మిగనూరులో సీపీఐ కార్యాలయం వద్ద ఏఐకేఎస్ జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు కల్పించేలా నిర్ణయాలు తీసుకొని రైతుల సంక్షేమం విస్మరించిందని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు మాలిక్ ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కేసీ జబ్బార్, శాంతప్ప, బిజీ.విరూపాక్షి నాయుడు, మల్లికార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి

పెద్దకడబూరు : రైతులు ఉత్సాహంగా వ్యవసాయం చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు బ్యాంక్‌లలో ఉన్న రుణాలు మాఫీ చేయాల్సిందేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ అన్నారు. డిమాండ్స్ డే సందర్భంగా రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ చేతుల మీదుగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డోలు హనుమంతు, లక్ష్మన్న, ఉసేన్‌సాబ్, ముక్కన్న, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై పోరాడుదాం

కోసిగి: రైతుల సమస్యల పరిష్కారానికి పోరాడుదామని రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు ఎం.గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో రైతు డిమాండ్స్ డేను పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. రైతులు రాజు, లక్ష్మన్, నరసింహులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- వినాయక చవితి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు
- జోరందుకున్న గణనాథుల విగ్రహాల విక్రయాలు
- రూ.వెయ్యి నుంచి రూ.65 వేల దాకా అమ్మకం


విక్రయానికి రూ.65వేల విలువ కలిగిన గణ నాథుడి విగ్రహం, విక్రయానికి వుంచిన వినాయక విగ్రహాలు

ఎమ్మిగనూరుటౌన్: వినాయక ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండటంతో గణనాథుడి విగ్రహాల తయారీ, విక్రయాలు వేగం పుంజుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విగ్రహాల వ్యాపారులు గుంతకల్, హైదరాబాద్ నుండి గణనాథుల విగ్రహాలను తయారు చేసే కళాకారులను పిలిపించి తయారు చేయిస్తున్నారు. మరికొన్ని అందమైన వివిధ ఆకృతుల్లో గణనాథులను రెడిమేడ్‌గా ఇతర ప్రాంతాలను తెప్పించి విక్రయానికి ఉంచారు. ఇప్పటికే పట్టణంలో పలుప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు గణనాథుల ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమతున్నారు. పట్టణంలో వందలాది విగ్రహాల తయారీ పనులను ముమ్మరం చేసుకున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన వినాయకచవితి కావడంతో ఇక ఐదురోజులే మిగిలి ఉడటంతో వినాయక విగ్రహాల కొనుగోలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో వినాయక మండళ్లు మండపాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. పట్టణంలోని గోనేగండ్ల రోడ్డులో రెండు, ఆదోని రోడ్డులో రెండు విగ్రహాల విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఒక్కో కేంద్రంలో 400 నుంచి 500 వరకు విగ్రహాలు విక్రయించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అడుగు నుంచి 13 అడుగుల వరకు..

పట్టణంలో ఒక అడుగు విగ్రహం నుంచి 13 అడుగుల వరకు విగ్రహాలు విక్రయానికి వుంచారు. రూ.వెయ్యి నుంచి రూ.65వేల వరకు వివిధ రూపాల్లో, ఆకృతులతో ఆకర్షనీయంగా రూపుదిద్దుకున్న విఘ్నాధిపతి విగ్రహాలు అందరినీ ఆకట్టుకొంటున్నాయి. నియోజకవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవర్గం తదితర ప్రాంతాల నుంచి ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు విగ్రహల కొనుగోలు చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు పెరిగాయి



వినాయక చవితి దగ్గర పడుతుండటంతో విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ కమిటీలు, నిర్వాహకుల సంఖ్య పెరిగిపోతుంది. దీంతో ఎక్కువ ఆర్డర్లు వస్తున్నాయి. విగ్రహాల తయారీకి ముడి సరుకులు, రంగులు, వాటి తయారు చేసే కార్మికుల కూలీల ధరలు పెరిగిపోయాయి. విగ్రహాల ధరలు మాత్రం పెంచలేదు. నష్టం అయినప్పటికీ విక్రయాలు అలానే కొనసాగిస్తున్నాం. ఈసారి లాభాలు కూడా అంతంతం మాత్రమే వచ్చేలా వున్నాయి.

– చంద్రశేఖర్, విగ్రహాల వ్యాపారి, ఎమ్మిగనూరు

మానసిక సంఘర్షణకు గురికావొద్దు


మాట్లాడుతున్న నెల్లూరు చిన్మయమిషన్ ఆచార్యస్వామి హరీష్ చైతన్య

ఆదోని సెంట్రల్: మనిషి ఎప్పుడూ మానసిక సంఘర్షణకు గురి కాకూడదని చిన్మయమిషన్ ఆచార్య స్వామి హరీష్ చైతన్య అన్నారు. స్థానిక చిన్మయమిషన్‌లో ఆదివారం ఒత్తిడిని అధిగమించి విజయాన్ని ఎలా సాధించాలి అనే అంశంపై పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. మన ఆలోచన విధానాలను నెగటివ్ ఆలోచనలో కాకుండా పాజటీవ్ ఆలోచనలోకి రావాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను, అంశాలను, ఆటలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తగు వివరించారు. కార్యక్రమములో చిన్మయమిషన్ ఆదోని ఆచార్యులు స్వామినారాయణ చైతన్య మిషన్ అధ్యక్షులు సుజాతమ్మ, కార్యదర్శి రఘునాథ్, జగదీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యార్డ్‌లో సమస్యలు పరిష్కరిస్తాం


మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మార్కెట్ యార్డ్‌ను ఎమ్మెల్యే పరిశీలించి రైతులు, ట్రేడర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురిస్తే విక్రయాలకు రైతులు తెచ్చే వేరుశనగ పంట ఉత్పత్తులు తడిచిపోతున్నాయని రైతులు, కొనుగోలు దారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అదేవిధంగా ఇదే వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల హోల్‌సెల్ మార్కెట్ వుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ట్రేడర్లు చెప్పారు. ఈసమస్యపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

ఆస్పరి కూరగాయల మార్కెట్ ప్రారంభం

ఆస్పరి: స్థానిక దినసరి కూరగాయలు మార్కెట్ ఆదివారం ప్రారంభమైంది. మార్కెట్లో కంట్రాక్టర్ కట్టెల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, రైతులు వెంకటరాముడు, తిమ్మప్ప, ప్రకాష్, రామకృష్ణ, మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం నివేదిక ప్రభుత్వానికి పంపుతాం


కుళ్లిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేసీ నవ్య

ఎమ్మిగనూరు రూరల్ / గోనెగండ్ల: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా మండలాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఏఏ పంటలు దెబ్బతిన్నాయని నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. ఆదివారం ఆమె ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, మండల కేంద్రం గోనెగండ్ల, గంజిహళ్లి గ్రామాల పరిధిలోని వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఎకరాకు ఎంత పెట్టుబడి పెట్టారు, వర్షానికి నానిపోవడంతో ఎంత నష్టం వస్తుందని వేరుశనగ పంటలను సాగి చేసిన రైతులను అడిగి తెలుసుకున్నారు. మూడు ఎకరాల వేరుశనగ పంటకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టామని, వర్షాల వలన పంట మొత్తం నానిపోయిందని, మేత నల్లబారిపోయిందని, వేరుశనగ మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు బుడ్డప్ప, హసన్‌లు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. రాళ్లదొడ్డి గ్రామంలో చాంద్‌బాషా అనే రైతు మూడెకరాల్లో వేరుశనగ వేశానని, పంట పీకిన వెంటనే వర్షాలు ప్రారంభంకావడంతో పంట తడిసిపోయి బూజుపట్టి, మొలకులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాజడు. ఎకరానికి రూ. 50 వేలు పెట్టుబడి పెట్టినట్లు రూ. 2 లక్షలకుపై ఇప్పటి వరకు పంటకు ఖర్చుచేసినట్లు వాపోయాడు. జేసీ నవ్య మాట్లాడుతూ కూలీల కొరత, యంత్రపరికరాల కొరత గురించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పంట నష్టపోయిన రైతుల నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపి నష్టపోయిన రైతులకు ఇన్స్‌రెన్స్ ద్వారా పరిహారం అందేలా చూస్తామన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గేవరకు ఎవరు ఏ పంటలను కోయవద్దని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ కురుస్తున్న వర్షాలకు పంటలలో ఏఏ చర్యలు తీసుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్ కుమారస్వామి, ఏడీఏ మహమ్మద్, ఖాద్రీ, ఏఓ హేమలత, ఆర్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ నిబంధనలు పాటించకుండా ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేసిన మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎల్లప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, కార్యదర్శి దేవపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులో సర్‌ప్లస్ అయిన గణిత ఉపాధ్యాయుడు పి.ప్రకాష్‌ను ఆయన విల్లింగ్ తీసుకోకుండానే ఏకపక్షంగా ఎంఈఓలు సంతనాగలాపురం కేటాయిస్తున్నట్లు డీఈఓకు నివేదించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కౌన్సిలింగ్ రోజున ఆ ఉపాధ్యాయుడు సెలవులో వున్నప్పటికీ ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మల్లారి నాగరాజు, యం.సుధాకర్, సంపత్‌కుమార్, మాదన్న, నాగరాజు పాల్గొన్నారు.

కౌలుట్ల చెన్నకేశవస్వామి సేవలో ఎమ్మెల్యే


ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన శ్రీదేవి,భూదేవి,సమేత కౌలుట్ల చెన్నకేశవస్వామి వారిని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దంపతులు, మంత్రాలయం ఎంపీపీ వై.గిరిజమ్మ, మంత్రాలయం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.ప్రదీఫ్‌రెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భార్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుమారుడు వై.భీమిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, పార్టీ మండల నాయకులు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ మా ఇలవేల్పు కౌలుట్ల చెన్నకేశవస్వామి అని, యేటా రెండు నుంచి మూడు సార్లు స్వామివారిని దర్శించుకుంటామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు మెంబర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పండితులు పులికొండస్వామి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ పరిశీలన


హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ డీఈ కర్రెన్న

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ భవనాల స్థితిగతులను ఏస్ఎస్ఏ డీఈ కర్రెన్న పరిశీలించారు. ఆదివారం హాస్టల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సమక్షంలో సందర్శించారు. హాస్టల్ పైకప్పుపై వర్షపు నీరు నిల్వ ఉండి లీకేజీలతో నీళ్లు కారుతున్నట్లు గుర్తించారు. వర్షాలు తగ్గేంత వరకు మూడు రోజుల పాటు హాస్టల్‌కు సెలవులు ప్రకటించారు. భవనాల మరమ్మతుపై నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నత అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. ఏఈ రంగరాజు ఉన్నారు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొని ఆదివారం ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్పరి గ్రామానికి చెందిన వీరేష్, చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రాఘవేంద్ర, మాన్విత్‌లు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకోవడంతో గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే మోసం చేయడం బాధాకరం


మాట్లాడుతున్న మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్‌అహ్మద్, మైనార్టీ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని ప్రజలను కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మోసం చేయడం బాధాకరమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్‌అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక ఆడియో కాల్ రికార్డింగ్‌లో తాజాగా వైఎస్సార్‌సీపీ నుంచి బీజేపీలో చేరిన వెల్లాల మధుసూదనశర్మ అనే నాయకుడు ఒక యూట్యూబ్ రిపోర్టర్‌తో మాట్లాడుతూ ఆదోనిలో బీజేపీ ఏవిధంగా ఎమ్మెల్యే వైఫల్యాల నుంచి దృష్టి మరలించడానికి ఒక అంశం చుట్టూ ప్రజల దృష్టి కేంద్రీకృతం అయ్యేలా కుట్రలు చేస్తుందో పూసిగుచ్చినట్లు వివరించాడన్నారు. ఇలా నెలకొక డ్రామాతో ఐదేళ్లు గడిపేయాలనే కుట్రలో ఎమ్మెల్యే పార్థసారథి హస్తం ఉందని స్పష్టమవుతుందని చెప్పారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చక ఇలా రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా రాజకీయాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

డి.బెళగల్‌లో రాష్ట్ర స్థాయి ల్యాక్రోస్ క్రీడలు


ల్యాక్రోస్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి కీర్తిని సన్మానిస్తున్న దృశ్యం


ల్యాక్రోస్ ఆడుతున్న క్రీడాకారిణులు

కోసిగి: జిల్లాలో మారుమూల ప్రాంతం డి.బెళగల్ గ్రామీణ ప్రాంతంలో రాష్ట్ర స్థాయి ల్యాక్రోస్ క్రీడలు నిర్వహించడం అభినందనీయమని, ఏపీ రాష్ట్ర ల్యాక్రోస్ క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి, కోసిగి హైస్కూల్ హెచ్ఎం, పీడీ ఖలీల్ అహ్మద్ అన్నారు. ఆదివారం కోసిగి మండలం డి.బెళగల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏపీ ల్యాక్రోస్ క్రీడల అసోషియేషన్ ఆధ్వర్యంలో డి.బెళగల్ విజేత యూత్ సమక్షంలో రాష్ట్ర స్థాయి అండర్–17 ల్యాక్రోస్ క్రీడలు ప్రారంభమయ్యాయి. క్రీడలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి ల్యాక్రోస్ క్రీడల్లో పాల్గొన్న కర్నూలు జిల్లా కులుమాల గ్రామానికి చెందిన కీర్తి అనే ఇంటర్మిడియెట్ విద్యార్థినిని శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామ య్య, యూత్ అసోషియేషన్ సభ్యులు నాగ రాజు, సల్మాన్‌రాజు, ఉసేని, ఎస్ఎంసీ చైర్మన్‌లు తిక్కయ్య, వీరనాగప్ప, సిద్దప్ప గౌడ్, ప్రభాకర్ గౌడ్, పాండు రంగ, రంగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.